# 5. టపా ప్రేమ

## 1

కలకత్తా

5-2-45

శ్రీ ముద్దు కృష్ణయ్యగారికి -

నమస్కారాలు. తమతో నాకు వ్యక్తిగత పరిచయం లేకపోయినా, పత్రికాముఖాన వెలువడే తమ రచనల్ని చదివి ఆనందిస్తూన్న నాకు తమ లేఖినితో చిరకాల పరిచయం వుంది. ఎన్నాళ్ళ క్రితమో యీ లేఖను రాసి ఉండాల్సింది. కాని ఏవేవో పిచ్చి అనుమానాలతో కాలం గడిచిపోయింది. మొన్న స్నేహితురా లొకతె తమ ఎడ్రసును సంపాయించి నాకు యీ సదవకాశాన్ని కలిగించింది.

తమ రచనల్ని అభినందించే పాఠక లోకంలో నాక్కూడా వొక స్థానం వుంది. ఆంధ్రదేశంలో "భావకవి సామ్రాట్" బిరుదు మీకు ఎందుకు ఇవ్వబడలేదో, అనేక చోట్ల మీకు సన్మాన గౌరవాలు ఎందుకు జరగలేదో నాకు తీరని సమస్య. ఇదే అనుమానం చాలామందికి ఉండి ఉండవచ్చు. ఆ మధ్య మీకు గొప్ప సన్మానం జరిగినట్టూ, అందులో మీ కేవేవో బిరుదులూ సన్మానపత్రాలూ, వెయ్యిన్నూట పదహార్లు ఇవ్వటమే కాకుండా - మిమ్ము ఏనుగు మీద ఎక్కించి ఊరేగించారని ఎవరో చెప్పుకుంటూండగా విన్నాను. ఇది ఎంతవరకూ నిజమో నాకు తెలియదు కాని, అది నిజమే ఐతే మాత్రం ఆంధ్రప్రజ చూపిన కృతజ్ఞతను మెచ్చుకోగలను... .... సుప్రసిద్ధమైన మీ రచనా నైపుణ్యాన్ని వర్ణించటం నా తలకు మించినపని (కనీసం నేనొక కవయిత్రినన్నా కాదాయె!)

మిమ్మ చూడాలని చాలాకాలంగా నా మనసు ఆరాటపడుతూ వుంది. మీ రచనల్ని చదివి మిమ్మొకవిధంగా ఊహించుకున్నాను. వెయ్యిమైళ్ళ దూరాన కూర్చుని ఊహలతోనే ఎల్లకాలం తృప్తిపడలేను. దయవుంచి తమ ఫొటో నొకదాన్ని పంపగలుగుతే ఎంతైనా కృతజ్ఞురాల్ని!

మొట్టమొదటి లేఖలోనే ఇంత స్వతంత్రించి రాసిన స్త్రీని మీరు అపార్థం చేసుకోరని తలుస్తాను. మానవ మనస్తత్వాన్ని - విశేషించి యువతుల మనస్తత్వాన్ని అమిత నిపుణతతో ఊహించి రచించగల మీకు - నా మనస్తత్వాన్ని గ్రహించటం అంత కష్టసాధ్యమైన పని కాదనుకుంటాను. మీ జవాబుకు ఎదురు తెన్నులు చూస్తూంటాను.

మీ పాఠకురాలు

రాధారాణి

నా ఎడ్రసు :

రాధారాణి

C/o మాధవరావు,

చిత్తరంజన్ ఎవెన్యూ,

కలకత్తా.

## 2

చిత్తూరు

8-2-45

శ్రీమతి రాధారాణి గారికి-

నమస్కారాలు. మీరు 5-వ తారీకున రాసిన ఉత్తరం అందింది. ఈ రకం ఉత్తరాలు రావటం నాకు కొత్త కాదు కాని - ఆంధ్ర స్త్రీల దగ్గర్నుంచి రావటం ఇదే మొదలు. తన రచనల్ని పాఠకలోకం ఎలా తూస్తోందో తెలుసుకోవాల్సిన అవసరం రచయితకు ఎంతైనా వుంది. అది రచయితకూ, తరువాత సాహిత్యానికీ కూడా చాలామేలు. ధైర్యంగా ముందుకువొచ్చి తమ అభిప్రాయాల్ని వెల్లడించగల స్త్రీలను నేను అభినందించగలను. స్త్రీ మనస్తత్వం ఎలా చిత్రించబడ్డదో చెప్పగలిగిందీ, చెప్పవలసిందీ స్త్రీలే కనుక, మీ అభిప్రాయాలు అతి విలువైనవి. స్త్రీ స్వాతంత్ర్య సిద్ధికోసం యీ బానిస దేశంలో శక్తివంచన లేకుండా పోరాడే నాలాటి యువకరచయిత విషయంలో మీరేమీ అనుమానించాల్సిన పనిలేదు. మిమ్మ మామూలు పాఠకురాలిగా మాత్రం చూడలేను.

సన్మానాలూ, బిరుదులూ – వాటి విషయం ఆలోచించి నేనెప్పుడూ బాధపడను. వాటివల్ల నా రచనా నైపుణ్యం పెరిగేదీ కాదు; తరిగేదీ కాదు. మీరు విన్నవార్తకు పునాదులు లేకపోలేదు కాని – అదంతా నిజానికి జరగలేదు. నా మిత్రులు కొందరు సన్మానమూ వెయ్యినూట పదహార్లూ ఇద్దామనుకున్నారు. అదే సమయంలో మా వూళ్లో పెద్ద సర్కసు వొకటి దిగింది. గజారోహణం కూడా పెడితే బాగుండునని నిశ్చయించుకున్నారు...కాని, అంత ఎత్తున ఏనుగును ఎక్కటం అంటే – చెప్పొద్దూ – నాకు మహాభయం వేసింది. ఆ సంగతి బైటపెడితే నా పిరికితనానికి అందరూ నవ్వుతారని, కొంతసేపు బెట్టుచేసినా చివరకు ఒప్పుకోక తప్పలేదు. సర్కసు వాళ్ళతో ఏనుగు బాడుగను గూర్చికూడా తేల్చుకున్నారు. కొన్ని పత్రికల్లో విరాళాలు అర్థిస్తూ ప్రకటనలు కూడా వేశారు. ఒకటి రెండునాటకాలు పెట్టి డబ్బు వసూలు చేసేందుకు గట్టి ప్రయత్నాలు చేశారు...కాని ఏం లాభం...అతికష్టంమీద కటికనూట పదహార్లు మాత్రమే వసూలైనవి. కాలఖర్మవశాత్తూ నేను ఎక్కనున్న ఏనుగుకు పెద్దజబ్బుచేసి ఢామ్మిన చచ్చింది. చచ్చిననాడే అది మళ్ళీ పైకి రాకుండా పెద్ద గొయ్యితీసి పాతిపెట్టేశారు. వెధవ గజారోహణం తప్పినందుకు ఒక విధంగా సంతోషపడ్డాను. మిగతా రెండుమూడు ఏనుగులు వాళ్ళకు ఉన్నయ్ కాని, అవన్నీ పిల్లలు. అంత ఎత్తు లేకపోవటంవల్ల, ఒకవేళ కిందపడ్డా ప్రాణభయం మాత్రం ఉండదు...తీరా సన్మానపు రోజు నాటికి అంతవరకూ చేసిన సన్నాహాలకు, వసూలు చేసిన పైకం సరిపోయింది. నాకు బహుమతిగా ఇద్దామనుకున్న వొట్టిపర్స్ మాత్రమే మిగిలింది. గజారోహణం లేకపోయినా అశ్వారోహణం జరిగేదనుకోండి. అసలు డబ్బు లేందే ఇవన్నీ ఎలాసాగుతయ్? చివరకు ఆ ఒట్టిపర్స్ మాత్రం నాకిచ్చారు. దానికి ఎక్కువ తాకిడి లేకపోవటంవల్ల, ఇది జరిగి సంవత్సరమైనా నా దగ్గర అదింకా చెక్కు చెదరకుండానే వుంది...మిగతా బిరుదులూ అవీ ఇచ్చారు కాని వాటిని వాడేందుకు నాకు మనసు పోవటం లేదు; అవి బూజుపడుతున్నయ్. ఇక లోకులు పలుగాకులు! అదుగో తోక అంటే ఇదుగో పులి అంటారు. ఎన్నో రకాల ప్రచారాలు చేస్తారు. అలాగే నా ఒట్టొట్టి గజారోహణం కూడా ప్రచారమై ఉండొచ్చు. ఇంకానయం – నేను ఏనుగును ఎక్కానని ప్రచారం జరిగింది కనుక సరిపోయింది కాని – ఏనుగే నామీదికి ఎక్కిందని ప్రచారం సాగినట్టయితే మనిద్దరిమధ్యా యీ ఉత్తరాలకు పెద్ద అంతరాయం కలిగేది. ఐనా పెద్దగా విచారించాల్సిందేమీ లేదులెండి... ఆంధ్రదేశంలో మామూలు పద్ధతి వొకటున్నది; దాని ప్రకారం నేను చచ్చాక నాకు అఖండకీర్తి, నా గూర్చిన సానుభూతి సభలూ తప్పవు. డబ్బు ఏమైనా వసూలైతే చౌక్‌లో నా శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠచేసినా చెయ్యవొచ్చు. వాటిని చూసి స్వర్గంలోంచి నేను కన్నీరు విడువక మానను!

మీరు కోరిన ప్రకారం యీ కవరులో నా ఫొటోను పంపుతున్నాను. కాని ఒక్కమాట! నేను మీ ఊహా చిత్రానికి ఎంతమాత్రమూ పోలనని నా నమ్మకం. అందానికీ

కళానైపుణ్యానికీ లంకె వుండదు. నేను ఎంతవరకూ సరిగ్గా చెప్పగలిగిందీ మీరు రాయాలి; ఎందుకంటే - నేను మీ ఊహా చిత్రాన్ని చూడలేదు; కనీసం ఊహించుకోలేను - కూడాను!

మీరు తీసుకున్నది స్వాతంత్ర్యం కానేకాదని నా నమ్మకం. "స్త్రీ - బానిసత్వం" అన్న నా గేయ సంపుటి చదువుతే మీకిది అర్థమై తీరుతుంది. "చీకటి" అనే ఖండ కావ్యంలో కూడా యీ విషయాన్ని తర్కించాను. ఒకవేళ మీరనుకొనే స్వాతంత్ర్యం మీరు మీ మొదటి లేఖలో ఉపయోగించుకొని ఉన్నట్టయితే నేను మీ విశాల దృక్పథాన్ని అభినందిస్తున్నాను. అట్టి స్వాతంత్ర్యాన్ని నిర్భయంగా ఇక ముందుకూడా ఇంకా అనేక రెట్ల పరిమాణంలో ఉపయోగించుకొని - మీ వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తారని కూడా నమ్ముతున్నాను.

పాఠకురాలి హృదయం ఎంతగానో ఆనందపడుతూ - హృదయకుహరంలో మరి దాగలేక నయాగరా జలపాతం లాగు దభీమని దూకిందన్న సంగతి నాకు విశదమైంది-

పోతే, నాదికూడా ఒక కోర్కె వుంది. మీరు ఎవరి రచనల్ని ఆనందిస్తున్నారో ఆ రచయిత ఫోటోనన్నా చూడాలనే వింత కోర్కె మీ కెలా కలిగిందో (అందువల్ల వచ్చేదీ పొయ్యేదీ యేమీలేదని మీకు తెలిసికూడా!) అలాగే నా రచనల్ని చదివి ఆనందించే పాఠకురాల్ని చూడాలనే వింత కోర్కె నాకు కలగటంలో అసహజమేమీ లేదు. మీకున్న అవకాశాలేమిటో, మీ పరిస్థితులేమిటో తెలుసుకోకుండానే కోరినందుకు - అన్యథా భావించరని తలుస్తాను. మనిషిని మనిషిగా చూసే అవకాశం లేనప్పుడు ఆ ఛాయనుచూసి తృప్తిపడటాన్ని కనిపెట్టేందుకు మనం మొదటివాళ్ళం కాదు కనుక, నా యీ కోర్కెను ఏవిధంగా తీర్చగలరో నేను వేరే రాయనక్కర్లేదు...మీ జవాబుకు ఎదురు చూస్తుంటాను.

మీ అభిమాన రచయిత
ముద్దు కృష్ణయ్య

**3**

కలకత్తా
11-2-45

ముద్దు కృష్ణయ్యగారికి -

నమస్కారాలు. నా మొదటి ఉత్తరం పోస్టులో వేశాక - యీ ఐదారు రోజుల్నుంచీ నాకెందుకనో భయం భయంగా వుంది... రెండు మూడుసార్లు పీడ కలలు కూడా వొచ్చినయ్. ఇవాళ మీ ఉత్తరం అందుకున్నప్పుడు - చింపేప్పుడు నావేళ్లు ఒణికినయ్.

చదివేప్పుడు మొదట అంతా తెల్లకాగితం లాగే కనిపించింది. ఆతృతను తగ్గించుకొని చదువుతూ నా జన్మలో పొందనంతటి ఆనందాన్ని అనుభవించానంటే నమ్మండి!

అన్నట్టు – నా ఉత్తరంలో మీ పుస్తకాలన్నిటినీ వి.పి.పి.గా పంపమని అడుగుదామనుకున్నాను; ఆంధ్ర దేశానికి ఇంతదూరంలో వున్నాక మీ రచనల్ని మించిన స్నేహితులు నా కెవరూ లేరు. అలాటి స్నేహితుల్ని పుస్తకరూపంలో నన్నా ఆహ్వానించి పూజించాల్సిన బాధ్యత నాకు వుంది. వెంటనే ఆ సదవకాశాన్ని కల్పించగోరుతాను.

స్త్రీ జాతిని తృణీకరించే పురుషజాతిలో మీలాటి ఉత్తమోత్తములు బహు అరుదు. మీరిచ్చే గౌరవానికి స్త్రీజాతి తరఫున నా అభివందనాలు.

సన్మాన గౌరవాల విషయంలో మీ అభిప్రాయం ఎంతో ఉదారంగా వుంది; కాని ఆంధ్రులు అంధులై తమ కర్తవ్యాన్ని మరిచినందుకు నా హృదయం క్షోభిస్తోంది. మీ ఊరికి యీసారి సర్కస్ వొచ్చినప్పుడన్నా మీ మిత్రులు గజారోహణాన్ని జరిపి తీరుతారని నమ్ముతున్నాను.

మీఫొటో చూశాక నా ఊహా చిత్రంలో మీరు అనుకున్నంత మార్పు రాలేదు. నిజానికి నేను ఊహించకున్నదానికంటే – ఎంతో అందమైన ముఖం! విపులీకరిస్తాను: ఒక్కో మనిషికి ఒక్కో ఊహా చిత్రం, స్వాప్నికమూర్తి వొకటి వుంటుందని నా నమ్మకం: అలాటి చిత్రంతో సరితూగే మనిషి యీ లోకంలో అసలు ఉంటాడో లేదో నాకు తెలియదు. కాని ఆ చిత్రాన్ని జాగర్తగా దాచుకొని, ఏకాంతంలో ఆనందిస్తూ – కలలు కనటంలో ఒక తృప్తి వుంటుంది. ఇక నా విషయంలో – కాల్పనిక వ్యక్తికి సరిగ్గా సరిపడే మనిషి వాస్తవిక జగత్తులో కూడా ఉండే అవకాశం వుందని – మీ ఫొటో చూశాక – తెలుసుకో గలిగాను.

మీరు నా ఫొటోను కోరి నన్ను చాలా సిగ్గుపరిచారు. ఆ సిగ్గు నేను స్త్రీనైనందుకు కాదు. అపరూప నాయకిని సృష్టించగల మీ లేఖిని ముందు నా రూప లావణ్యాలు – హనుమంతుడి ముందు కుప్పిగంతుల్లాంటివి. ఏమైనా మీలాటి పెద్దల కోర్కెను తోసిపుచ్చే ధైర్యం నాకు లేక – ఫొటోను పంపుతున్నాను.

నా పరిస్థితుల విషయంలో మీ కేమీ సందేహం అక్కర్లేదు. మాధవరావుగారికి నేను ఏకైక పుత్రికను. చిన్నతనంలోనే మాతృవిహీననయినా – తల్లి లేనిలోటు కనిపించనీయకుండా అల్లారు ముద్దుగా పెంచుతూ వొచ్చారు. వారికి నన్ను గూర్చిన విచారం ఒక్కటే – నా వివాహం. కాలేజీ చదువుతో కాలాన్ని వెళ్ళబుచ్చుతూన్న నాకు మాత్రం అదొక పెద్ద సమస్యగా తోచలేదు. అందుకు కారణం – వరుణ్ని ఎన్నుకునే శక్తి నాకు లేకపోవటం; పదితరాల వరకూ సరిపడే యీ భాగ్యాన్ని చూసి అనేక మంది యువకులు నా వెంటపడి నన్ను వేధించి విసిగించటం–

నా గూర్చిన సోది మొదలెట్టానేమిటి? మీ జవాబు కోసం - ముఖ్యంగా మీ పుస్తకాలకోసం ఎదురు చూస్తూంటాను. మన స్నేహాన్ని దూరం అనేది దూరం చెయ్య కూడదని నా కోర్కె

మీ పాఠకురాలు
రాధారాణి

**4**

చిత్తూరు
15-2-1945

డియర్ రాధా!

ఇలా సంబోధించినందుకు మీరు అన్యధా తలవకండి. మీ 11-వ తారీకు ఉత్తరంలో చివర "మన స్నేహం" అన్నారు; అందుకు నేనెంతో కృతజ్ఞుణ్ణి. స్నేహాన్ని పెంపొందించ దలిచాక గౌరవ మర్యాదల్నీ ఎక్కువ తక్కువల్నీ మరిచిపోయి - ఇద్దరమూ ఒకే మెట్టుమీదికి రావాలి. స్నేహం పెరిగేకొద్దీ - చనువు అభివృద్ధి చేసుకునే నిమిత్తం - పేర్లను తగ్గించటం మామూలు.

నా ఉత్తరం ఆలస్యంగా జేరి మిమ్మ చాలా కష్టపెట్టి వుంటుంది. సున్నితమైన మీ వేళ్ళు కవరు చింపేప్పుడు వొణకటాన్ని తలుచుకొని, నేనిక్కడ మలేరియా రోగిలా ఒణికానంటే నమ్మండి. కవరు అంటించకుండా వేసినా బాగుండేది; చింపే శ్రమా, మీవేళ్ళు ఒణికే దుర్ఘటన సంభవించకుండా ఉండేవి. కాని మధ్యలో కొక్కి రాయిగాళ్లు చదివి అసలు జేరనియ్యరేమోనని అనుమానించి బాగా అతికించి పంపుతున్నాను. ఎయిర్ మెయిల్‌లోనన్నా ఉత్తరం వెయ్యని ఈ కఠినాత్ముణ్ని క్షమిస్తారా? కాని యీ కఠినతనమంతా నా వొక్కడిదేకాదు; సగానికి పైగా పోస్టువాళ్ళదని మీకు తెలుసు. మీ పీడకలల విషయం - మీ ఉత్తరం నాకు అందే లోపల నేను కూడా ఒక పావుడజను పీడకలల్ని కన్నాను. మనలాటి స్నేహజీవులకు పీడకలలు తప్పని నరకం! ఒక రకంగా స్వర్గం కూడాను!

నా పుస్తకాలు అడిగారు. వాటిని పంపుతున్నాను. కాని వాటికి మీ నుంచి నేను కోరే ధర వొక్కటే - మీ అమూల్యాభిప్రాయం!

మీ ఉత్తరం చదివాక - మీరు నన్ను ఎంత ఉన్నత ప్రదేశాలకు - ఎవరెస్టు శిఖరం అనటం మంచిది - తీసుకు వెళ్ళ గలిగారో మీరు ఊహించి వుండరు. ఈ ధృవతారలోంచి కిందికి చూసేందుకే నాకు భయంగా ఉన్నదంటే మీకు అర్థ మౌతుందనుకుంటాను. నన్ను ఒక్కటే అనుమానం బాధపెడుతోంది - నన్నిలా పైకి

పంపటం వల్ల – మీకు దూరంచేసే ప్రయత్నాన్ని చెయ్యటంలేదుకదా! అద్దంలోని నా రూపానికి నేనెప్పుడూ మూర్ఛ పోలేదు కాని మీ ఉత్తరం చదివాక మాత్రం – మొట్టమొదటిసారి నా పద్యాలు అచ్చయ్యాక చూసినప్పటికన్నా ఎన్నో రెట్ల గర్వానికి గురయ్యాను.

మీ ఫొటో చూశాక – నాకు కలిగిన అభిప్రాయాన్ని కూడా రాస్తున్నాను; పావు శతాబ్దానికిపైగా యీ భూలోకవాసం చేస్తూ యీ అందాలరాణిని ఎందుకు చూడలేకపొయ్యానా అనిపించింది. మీరన్న ఊహా చిత్రం లాటిది – కాల్పనిక సుందరి – నాక్కూడా వుందికాని, నా ఊహ పోలేనంత దూరాన మీ సౌందర్యం వుందని తెలుసుకొని – నా కవితాకన్య చాలా సిగ్గుపడ్డది. మీ ఛాయా చిత్రాన్ని చూస్తూ నా కలం ఒక అత్యుత్తమ నాయకిని సృష్టించగలదనే నమ్మకం నాలో నాటుకుపోయింది. ఇందుకు తార్కాణంగా కొన్ని భావగీతికలూ, పద్యాలూ పంపుతున్నాను. ఆసు కవిత్వం నాకు అలవాటులేని మేళం. అయినా ఇంత బాగా కుదురుతయ్యని కలలోకూడా అనుకోలేదు. వీటిని ప్రచురించే ముందు – ఏ వ్యక్తిని ఉద్దేశించి ఇవి రాయబడినవో – ఆ వ్యక్తి అనుమతికోసం వేచికూర్చున్నాను. మీ అనుమతితో పాటు, అభిప్రాయంతో పాటు – వీటిని తిప్పి పంపండి.

మీ చరిత్రచెప్తూ, చెప్తూ ఆపేశారు. దాన్ని "సోది" అనటం సాహసం! మీరు నా దగ్గర మాత్రం అనుమానించాల్సిన పనిలేదు. మీ జవాబుకోసం ఎదురుచూసే –

మీ ముద్దు కృష్ణయ్య

## 5

కలకత్తా

17-2-45

డియర్ ముద్దూ!

ఇలా సంబోధించినందుకూ, యీ స్వాతంత్ర్యాన్ని తీసుకున్నందుకూ మీరు అన్యధా భావించరనుకుంటాను. మీరు నా పేరును కత్తిరించినట్టే – నేను మీ పేరును కత్తిరించి ఆశ్చర్య పొయ్యాను. కత్తిరించగా మిగిలిన ముక్క ఎంత మధురమైనదో వర్ణించగల చాకచక్యం నాకు లేదు... జీవితంలో పాత్రతగల స్నేహితుడికోసం ఉవ్విళ్ళూరే నా హృదయానికి మీ లేఖ చక్కని జవాబు చెప్పింది.

మీ పుస్తకాలు అందుకున్నాను. నా అభిప్రాయాన్ని ఇవ్వమన్నారు; నా అర్హత యేమిటో నాకు తెలియదు. మీ మీద నాకున్న నిశ్చితాభిప్రాయం ఒక్కటే – ఈ శతాబ్దంలో మీకన్న రచనా నైపుణ్యాన్ని ప్రదర్శించ గల రచయితలు మరి ఉండబోరు.

మిమ్ము నేను కొత్త ప్రదేశాల్లోకి - అత్యున్నత శిఖరాలకు తీసుకుపోలేదు. ఒకవేళ మీరు అంత ఎత్తుకు ఎగిరిపొయ్యే పక్షంలో - నన్ను యీ భూమి మీద ఒంటరిని చేయరని నమ్ముతున్నాను. నా అసమర్థతను మీ సమర్థతతో కప్పిపుచ్చయినా - మన స్నేహాన్ని ఒకే మెట్టుమీదికి లాగవలసిన బాధ్యతను మీరు తీసుకోవాలని నా ప్రార్థన.

మీ కవిత్వం చదివాను. మధుర తమంగా వుంది. నన్ను గూర్చే రాశా రనుకున్నాను. ఇదే నిజమైతే నాకన్న అదృష్టవంతురాలు ఎట్లా వుంటుందో చూడాలని వుంది. ఇన్ని శతాబ్దాలు గడిచాక రాధాకృష్ణుల ప్రేమను - ఇంత వేడిగా, వాడిగా, హృదయంలోనుంచి దూసుకు పొయ్యేట్టు సూటిగా, ఘాటుగా ఎంత నైపుణ్యంగా రాయగలిగారూ! అవి పద్యాలా! పసిడితునకలు! ఖండ కావ్యమా? కళాఖండం! గేయాలా! హృదయంలోని ప్రేమ రాపిడివల్ల ఏర్పడే గాయాలు!..ఆ నాయకిని నేనేనని తలుచుకుంటూ ఎంత గర్వపడ్డాను!... నా గూర్చి మీరు పడే శ్రమకు అర్హురాలినా అనే సందేహం మాత్రం నన్ను పీడిస్తూ వుంది. మీ రచనను ఉంచుకుందామనుకున్నాను; అలా చేసి మీ మాటను ధిక్కరించే సాహసం లేక - తిప్పి పంపుతున్నాను.

నా చరిత్ర వినాలనే కుతూహలం మీకు ఉండొచ్చు కాని, అదంత చెప్పుకోదగ్గదీ, విన దగ్గదీ కాదు. ఒక్క ఐశ్వర్యంలో అన్ని సౌఖ్యాలూ ఇమిడిలేవన్నది ఒక్కటే నా జీవిత సారాంశం. హృదయ మివ్వగల మీలాటి స్నేహితుడొక్కడే నా జీవితానికి లోటు; అదికూడా పూర్తయింది. కనుక - చెప్పుకోదగ్గ విశేషమేమీ ఉండదనుకుంటాను.

త్వరలో జవాబు రాస్తారు కదూ?

స్నేహాభిలాషిణి

రాధారాణి

## 6

చిత్తూరు

23-2-45

డియర్ రాధా!

మీ ఉత్తరం చదివాక నాకు మతి పోయినట్టయింది. అది వొక సమ్మోహనాస్త్రం! ఇరవై నాలుగు గంటలయ్యాక కాని మామూలు మనిషిని కాలేదు. అందుకనే యీ ఉత్తరం రెండురోజులు ఆలస్యంగా బయలుదేరుతోంది.

టేబిల్‌మీద నిండు సిరాబుడ్డి ఉపయోగార్థం - సిద్ధంగావున్నా - అమోఘమైన మీ లేఖకు జవాబు రాసేందుకు కలం వెనుకంజ వేస్తోంది. ఇక ఆలస్యం చేసి నొప్పించకూడదని నిశ్చయించుకొని - ఏదో రాస్తున్నాను.

నా పేరును కత్తిరించి ఎంత అందంగా, పొట్టిగా చెయ్యగలిగారూ! నా పేరు మొదట్లోనే ఇంత మాధుర్యం ఉన్నదన్న సంగతి మీ ద్వారా ఇప్పుడే తెలుసుకోగలిగాను. మీ సంభోదన మన మధ్యవున్న అనుమానపు తెరలన్నిటిని రూపుమాపింది. అందుకు నా ధన్యవాదాలు.

మన మధ్య వున్న దూరం మాత్రం మన స్నేహాన్ని దూరం చెయ్యలేదని నిశ్చయంగా తెలుసుకున్నాను. మిమ్ము ఒంటరిగా వొదిలి దూరం వెళ్తానేమోననే భయం మీకు ఉన్నదన్నారు. అలా వెళ్ళగలిగే శక్తి నాకు మరి లేదు. ఆకాశానికీ భూమికీ ఎంతో స్నేహం. దూరదూరానవున్నా, ఎత్తు పల్లాల్లో ఉన్నా - ఎంతదూరం వెళ్ళినా ఒకదాన్నొకటి అంటి పెట్టుకునే వున్నయ్; అవి ఎప్పటికీ కలవవు. కాని మన స్నేహం మాత్రం కొద్ది దూరంలోనే విడిపడని ముడితో బంధింపబడగలదని నా నమ్మకం.

మీ ముందు నిలబడే యోగ్యతకే ఉవ్విళ్లూరే నాకు - మీ స్నేహలేఖ ప్రసాదించిన స్థానం నిజంగా గర్వింపదగ్గది. స్త్రీ హృదయపు లోతుల్ని చూపగలిగే మీలాటి రసికురాలి స్నేహపు విలువను జీవితమంతా ధారవోసినా ఇవ్వలేనేమో! అలాటిది నేను పంపిన పదిపేజీల కవిత్వమూ ఏమూలకూ? ఆ నాయకిని "మీరు"గానే వెంటనే గుర్తించగల మీ కుశాగ్రబుద్ధికి నా ధన్యవాదాలు. ఆ కవిత్వంముందు లోగడ రాసిన నా కవిత్వమంతా బలాదూర్! నాయకిగా మీ అర్హతను మీరు సందేహించనక్కర్లేదు. ఆ కాళిదాసే మిమ్మల్ని చూసినట్లయితే - శాకుంతల మూడింతలు పెరిగేది. పెద్దన మిమ్ము ఎరిగివుంటే వరూధిని విషయంలో ప్రవరుడుచేసిన అన్యాయానికి తావులేకపొయ్యేది; కావ్యం ఇంకో అరడజను రెట్లుగా పెరిగేది కూడాను....మీ కళ్ళను చూస్తేచాలు-కోహినూర్ వజ్రాన్ని చూడక్కర్లేదు. ఆ కళ్ళల్లోనుంచి మీ హృదయమంతా - దర్పణంలోలాగు కనిపిస్తూ వుంటుంది...అదంతా దేనికీ!- ఇద్దరు ముగ్గురు మిత్రులకు - మొన్న మీకు పంపిన కవిత్వాన్ని వినిపించాను. వాళ్ళు మూర్ఛ పొయ్యారు. నాలోని గొప్పతనం రచనా నైపుణ్యం ఒక్క రోజులో వింధ్యపర్వత పరిమాణంలో ఎలా పెరిగిపోయిందో నని ఆశ్చర్య పొయ్యాను. ఇదంతా మీ ఛాయాచిత్రం నాలో రేకెత్తించిన కొత్త శక్తి సామర్థ్యాలు! ఇక మీకు మీరుగా ఎదుటవుంటే... నా లేఖిని ఎటువైపు, ఎంత సామర్థ్యంతో, వేగంతో ప్రయాణం చేస్తుందో ఊహించే శక్తికూడా నాకులేదు. జీవితానికీ - సాహిత్యానికీ ఇంత గొప్పనాయకి లభ్యమౌతుందని కలగన్నానా? ఈ కొత్త నాయకితో 'రాధారాణి' అనే రసవత్తరమైన నవల రాయాలనే దృఢసంకల్పం కలిగింది-

నా రచనను ఉంచుకుందామను కున్నారా?...ఒద్దు. దాన్ని పత్రికలకు పంపాను: అచ్చుయి రాగానే మీకో డజను కాపీలు పంపుతాను. రచయిత విధిని నేను నిర్వహిస్తున్నాను. ఏ నాయకిలో జీవితమాధుర్యం జీవనదీ ప్రవాహంలాగు నురుగులు

కక్కుతూ వుంటుందో - ఆ నాయకిని - ఆ "నూర్జహాన్" ను - మిగతా పాఠకలోకం కూడా తెలుసుకొనే అవకాశాన్ని ఇస్తాను.

మీ జీవితంలోని లోటేమిటో నేను గ్రహించాను. ఆకాశమంత ఐశ్వర్యానికి చంద్రు డొక్కడే లోటు - అంతే కదూ? ఆకాశం ఒక్కటే తక్కువగా నేనిక్కడ వేళ్ళాడుతున్నాను. ఒకరి లోటును ఒకరు తీర్చుకుంటే - ఒకరి జీవితాన్నొకరు వెలిగించగలం!...మరి దాపరికం లేకుండా మన యీ స్నేహాన్ని "ప్రేమ" అని వ్యవహరించేందుకు మీరు అనుమతిస్తా రనుకుంటాను.

హృదయాన్ని విప్పి చెప్పే సమయాల్లో నిఘంటువులోని పదజాలం ఎంత తక్కువో ననిపిస్తోంది. మీ సాన్నిధ్యంలో శేష జీవితాన్ని గడపాలని నా హృదయం భరతనాట్యం చేస్తోంది. కాని దీనికి అవకాశాలు ఎంతో తక్కువ. నాకు కనీసం రెక్కలన్నా లేవు - వెంటనే ఎగిరివొచ్చి మీ ముందు దూకేందుకు! జీవిత పరిమితి స్వల్పమే అయినా - మీ ప్రేమ ఆ జీవితాన్ని అమూల్యంగా చేసింది...అంతకన్న జీవితంలో కోరదగిన వరం ఏముంటుందీ?

ఇంతకూ నా ఆశ్చర్యం ఏమిటంటే - మన ప్రేమ ఇంత త్వరలో ఎంత పరిపక్వం ఐందా అని : అదంతా విధి విలాస మేనేమో? ఏదైనా ఆ ప్రేమను ఆలసించి - ఆశాభంగులు కాకుండా - అనుభవించటం - విజ్ఞుల లక్షణం! త్వరలోనే - అంటే ఒక పక్షం రోజుల్లో మీ దగ్గరకు రాగలను. టపా వాళ్ళకు మన ఉత్తరాల్ని (ఉత్తరోత్రా పెద్ద బుక్ పోస్టులు అనవొచ్చు) మోసే శ్రమ తప్పుతుంది. ఆ క్షణాల్ని తలుచుకుంటేనే - ఇది ఏ లోకమో కూడా మరిచిపోతున్నాను.

అసలు వస్తువు లభ్యమవక పోవటంవల్ల - దాని ఛాయ - అంటే మనం ఒకరికొకరం పంపుకున్న ఫొటోలే - మన హృదయాల్లో యీ భూకంపాన్ని కల్పించినయ్యంటే - నిజమైన - వ్యక్తిగత స్నేహంలోని శక్తి మనను ఏం చెయ్యలేదో ననిపిస్తోంది.

రాసేందుకు ఇంకేమీ తోచటం లేదు.

మీవాడు

ముద్దు

తాజాకలం : ఈ ఉత్తరం పూర్తికాగానే సిగరెట్టు వెలిగించాను; నేను సిగరెట్టు తాగటం మీకు ఇష్టం లేకపోతే - ఆ పొగ మీకు పడకపోతే - తక్షణం తెలియపరచండి - మానేస్తాను. నవ్యకవిత్వాన్ని తలకాయలోంచి కాగితం మీదికి అతివేగంగా దూకించే శక్తి గలది కనుక - ఇన్నాళ్ళూ సిగరెట్టును (సిగరెట్టు డబ్బులు రాకపోయినా!) సాధనంగా

ఉపయోగిస్తూ వొచ్చాను...అరదస్తా కాగితాలకు సరిపడే నవ్యకవిత్వం దిగింది - దాన్ని వేరే బుక్ పోష్టుద్వారా మీకు సమర్పించు కుంటున్నాను. సిగరెట్టుకన్న మంచి సాధనం - అంటే మీరు లభ్యమైననాడు - నా కవిత్వ ప్రచారానికి కలకత్తానుంచి మెడ్రాస్‌కు గుడ్స్ బుకింగు ఎంతైనా అవసరం. ఈ ప్రస్తుత కవిత్వాన్ని గూర్చి మీ అభిప్రాయాన్ని యధాప్రకారంగా జారీచేయ గోరుతాను.

మీ ముద్దు

## 7

కలకత్తా

27-2-45

డియర్ ముద్దూ!

మీ లేఖా - దివ్య కవిత్వమూ జేరినయ్. నా లేఖ చదివాక మీకు మతిపోయిందన్నారు; నేను మాత్రం అంతకు తక్కువ స్థితిలో వున్నానా! ఇలా మరికొంత కాలం సాగుతే ఇద్దరమూ దాదాపు ఒకే కాలానికి మనకు మధ్యలో వున్న వాల్తేరు పిచ్చాసుపత్రిలో కలుసుకోవాల్సి వుంటుంది.

మీ నుంచి నేను కోరేదేమిటో ఇట్టే తెలుసుకున్న మీ నిశితబుద్ధికి నా ధన్యవాదాలు. మన ప్రేమ ఇంత త్వరలో ఎలా పరిపక్వమైందా అని మీరు ఆశ్చర్యపడనక్కర్లేదు. మొదటి కారణం - మన మధ్య చాలాదూరం ఉండటం వల్ల మన వ్యక్తిత్వాలూ, లోపాలూ సరిగ్గా తెలియకపోవటం; ఏమైనా లోపాలువున్నా మన ప్రేమ ప్రవాహం వాటిని శుభ్రంగా కడిగి పారెయ్యగలదు. దేన్ని నోటితో మాట్లాడేందుకు జంకుతూ, భయపడుతూ కాలాన్ని వృథా చేస్తామో - దాన్ని కాగితంమీదరాసి పోష్టులో పారేస్తే - మిగతా దంతా దానంతట అదే జరిగిపోతుంది. ఏదయితే దూరాన ఉండి మన ఆశాజ్యోతుల్ని ద్విగుణీకృతం చేస్తోందో - ఆ ప్రేమ వాక్యాల్ని (మీ విషయంలో కావ్యాలూ, మహా కావ్యాలూ, అనవొచ్చు) తేలిగ్గా కాగితం మీద విప్పి చెప్ప గలుగుతున్నాం. ఇంకో తమాషా ఏమిటంటే మనది టపా ప్రేమ. సాదాబండికీ, టపాబండికీ వేగంలో చాలా వ్యత్యాసం వుంది. దూర ప్రయాణాల్లో టపాబండి సర్వవిధాలా ఎన్నుకోదగ్గది. అలాగే సాదా ప్రేమకూ, మన టపాప్రేమకూ నడకలో చాలా వ్యత్యాసంవుంది. పోతే సాదాబండి రేట్లకూ, టపాబండి రేట్లకూ - మూడవ తరగతి ప్రయాణీకుల విషయంలో మాత్రం - తేడా వుంది. మన ప్రేమ మొదటి తరగతికి చెందింది కనుక - రేట్లలో కూడా భేదమేమీ లేదు: మిగతా కవర్లకు అంటించినట్టే మన ప్రేమలేఖలక్కూడా అణన్నర పోస్టుబిళ్లే చాలు కాదా!

నా జీవితాకాశంలో మీరు చంద్రులన్నారు: ఒళ్ళు జలదరించే మాట:... కాని అసలు చంద్రుడులాగు పదిహేను రోజులే వెలిగి, మిగతా పదిహేను రోజులూ మాయమవరు కదా!

మీ రచనలకు ముఖ్యంగా రాయబొయ్యే (ఈపాటికి మొదలుపెట్టే వుంటారేమో?) "రాధారాణి" నవలకూ సిగరెట్లు వొకసాధనం అన్నారు. కాల్చండి - ఎన్నయినాసరే. నా యిష్టాయిష్టాల్తో పనిలేదు. ఎందుకంటే ఆ పొగతోపాటు కవిత్వం కూడా వొస్తూ వుంటుంది కనుక: అదీ కాక పొగ చిత్తూరునుంచి కలకత్తా జేరే అవకాశం యేమీ లేదు కూడాను. అదిగాలిలో యెగిరి ఆ మీటర్ గేజ్‌లోకి మాయమౌతుంది. కాని మీ రసమయకవిత్వం శాశత్వంగా నిలిచి పోతుంది. నేనది చదువుకొని ఆకాశంలో ఆవేశంతో విశ్వవిహారం చెయ్యగలను; నాలాగే ఇంకా అనేకులు!

మీరు పంపిన కవిత్వం మధురాతి మధురంగా వుంది. నిజంగా నాలో - పొరపాటు - నా ఫొటోలో ఇంత ఆకర్షణ వున్నదా అనే అనుమానం కూడా కలిగిందికాని - ఆ కాళిదాసూ, నన్నయా నన్ను చూడక పోవటంవల్ల సాహిత్యంలో ఒక లోటు కూడా ఏర్పడ్డట్టు సూచించారే - అది నాకు మాంచి సమాధానంగా తోచింది. చూసినట్టయితే యెలావుండేదో ఊహించగలమేకాని, నిజం తెలియదు. కనుక అది తేలని సమస్య : వాళ్ళ సంగతి ఎలావున్నా మీలాటి కవికుమారులు ఇంతగొప్ప కవిత్వాన్ని త్వరితగతిని అన్ని కేంద్రాలలోనూ ఒకేసారి విడుదల చెయ్యటమూ, నన్నీవిధంగా మెచ్చుకోవటమూ చూస్తేనే సాహిత్యానికి నేనెంత గొప్పసాధనాన్నో తేలిగ్గా అర్థమైంది. ఇక దానిఫలితం ఉభయులకూ అనంతానందాన్ని ఇవ్వటమేకాకుండా, సాహిత్యానికి వాల్యూములు వాల్యూముల కవిత్వాన్ని సరఫరా చేస్తూంటుంది కనుక యిది లోకకళ్యాణమైన వ్యవహారం!

నేను లభ్యమైన నాడు మీలోని కవిత్వం కట్టలు తెంచుకునేట్టున్నదనీ, సాహిత్య ప్రచారానికి గుడ్స్‌బుకింగ్ అవసరమనీ రాశారు. ఇప్పటికి నేను లభ్యం కాలేదనా మీ అనుమానం? అదలా వుంచండి - వాస్తవిక జీవితంలో మీరు నాకు లభ్యమైన నాడు మీ నుంచి నేను కోరేది ఒక్క కవిత్వ ప్రవాహమేకాదు : ప్రణయ ప్రవాహం; ప్రేమ ప్రవాహం - జలపాతం - హైడ్రో ఎలక్ట్రిసిటీ ఆనకట్టా - యిత్యాదులు - ఏమంటారు?

మీరు నన్నింకా "మీరు" అని సంబోధిస్తున్నారు. నాకు చాలా చిన్నతనంగా వుంది. నా స్వాతంత్ర్యం వెనుకంజ వేసే అవకాశాన్ని కల్పిస్తున్నారు. కనుక - ప్రియుడు ప్రియురాల్ని సంబోధించే విధానమే యెన్నుకోదగ్గది.

మీదాన్నే

రాధ

## 8

చిత్తూరు

2-3-45

డియర్ రాధా!

కంకణ హస్తాలద్వారా వొచ్చే ప్రణయ లేఖలు యెంత మధురమైనవి! ప్రియుడు ప్రియురాల్ని పిలిచే విధానాన్ని అవలంబించమన్నావు. నాకు కల్పించిన యీ సదవకాశానికి నా ధన్యవాదాలు.

నీ లేఖలూ నీ ఫొటో చూస్తుంటే నాలో ఒక పవర్ హౌస్ పనిచేస్తూన్నట్టు ఉంది: మన ప్రేమప్రవాహం - జలపాతం తాలూకు హైడ్రోస్టేషన్ అనటం సమంజసం: దాని స్పీడుకు నాశరీరం ప్రతిక్షణమూ భూకంపంలాగు దడదడలాడుతూనే వుంది - ఆ అమితోత్సాహంతో రాత్రిళ్లు సరిగ్గా నిద్రపట్టటం లేదు... వెధవనిద్ర!.... అథవా ఏ తెల్లవారుజామునో కాస్త కలత నిద్రపట్టినా మన ప్రణయ ఘట్టాల తాలూకు కలలు వొస్తున్నయ్. ఒక్కో కలతో ఒక్కో ఖండ కావ్యం తయారుచెయ్యవొచ్చు. ధ్యాస అంతా నీ మీదనే అయేప్పటికి - లోకంలో చూడదగ్గదీ, ఆనందించ దగ్గదీ, నీ దివ్యమంగళ విగ్రహం ఒక్కటే ననిపిస్తోంది. ఇంత స్వల్పకాలంలో నా హృదయంలో ఇంతఘట్టి పునాదుల్తో యెలా పాతుకు పొయ్యావో అర్థంకావటం లేదు.

మన టపాప్రేమను బహునిపుణంగా సమర్థించావు. నీలో ఒక కవయిత్రి కూడా వుంది, నీ సమర్థనా, తర్కమూ, రచనానైపుణ్యమూ చూస్తుంటే - అన్ని విధాలా ఒకరి కొకరం తీసిపోమేమో? అసలు మన పేరులే బాగా కుదిరినయ్ - రాధాకృష్ణులు - ఇంకేం కావాలీ? బ్యాక్ గ్రౌండ్‌లో వేణుగానం ఒక్కటే తక్కువ, దాన్ని గ్రామఫోన్ రికార్డుతో సరి పెట్టుకోవొచ్చు.

ఓ....డియర్....డియరెస్ట్ రాధా!

మన యీ మధురప్రేమ గాధా!

మన హృదయాలకు తీరని వ్యధ !

ఇదంతా చాట భారతమంత కధ !

టపాబండి అతి వేగంగా గమ్యస్థానాన్ని జేరినట్టు మన ప్రేమకూడా చప్పున ఒక వొడ్డు పట్టింది. జీవిత సాగరంలో యీదులాడే మనలాటి ప్రేమజీవులు కాల ఖర్మ వశాత్తూ - ఇండియన్ పోస్ట అండ్ టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంటు ధర్మాన - ఇంత ఆనందమయ ప్రదేశానికి కొట్టుకొచ్చి నందుకు ఆ విధికి నా ధన్యవాదాలు. టపాబండి వేగంలాగే మన ప్రేమకూడా వేగంగా మాత్రం చల్లారకుండా చూసుకోవాలి సుమా!

నీ జీవితాకాశంలో నా చంద్రత్వాన్ని అపార్థం చేసుకున్నారు. ఆ చంద్రుడు పదిహేనురోజులే కనిపిస్తాడంటే భూమి అడ్డం పడుతూంటుంది కనుక - ఇక్కడ అలాటిదేమీ లేదు...అన్ని అడ్డంకులూ వివాహంతో విచ్ఛిన్న మౌతయ్.

అంతదూరాన ఉండి నా శక్తిని ఇలా విజృంభింపజేసి కూడా - నీ శక్తిని అనుమానించటం హాస్యాస్పదం! నీ నుంచి వెలువడే ఒక్క చిరునవ్వు నా జీవితాన్ని వెలుగుతో నింపి స్వర్గతలాన్ని జ్ఞాపకం చేస్తుంది. నీ చిరునవ్వు నీకు విలువలేనిదే అయినా - నాకు మాత్రం లోకంలో అతిస్వల్ప పరిమాణాల్లో దొరికే "రేడియమ్" "ప్లాటినమ్" లాటి విలువైన వస్తువు. ఇక జీవితమంతా నీ చిరునవ్వులే అయితే - (నవ్వుల పువ్వులు లేక, పువ్వుల నవ్వులు) ఇంక చెప్పాలా?

నువ్వు లభ్యమైనాడు నానుంచినువ్వు కోరేవాటన్నిటినీ సమర్పించుకునేందుకు యీ దీనుడు ఎప్పుడూ సిద్ధమే! ఎలాగైనా వారం పదిరోజుల్లో నీ దర్శనం కలిగించుకుంటాను.

నీ ఉత్తరం వొచ్చేలోపల రెండుదస్తాల కాగితాలకు సరిపడే నవ్య కవిత్వాన్ని దించాను: దాన్ని వేరే బుక్ పోస్టు ద్వారా సమర్పించుకుంటున్నాను.

నీ ముద్దు

## 9

కలకత్తా
12.3.45

ఆర్యా!

ఈ ఉత్తరం రాసేందుకు కొంచెం ఆలస్యమైంది: మొదటికారణం ఎలారాయాలో అర్థంకాకపోవటం. రెండొవ కారణం మీరు త్వరపడి విషయం తెలుసుకోకుండా కలకత్తా మెయిల్‌లో పడతారేమోననే భయం. అందుకని ఏలాగో రాసేస్తున్నాను.

ఇక్కణ్నుంచి వొచ్చే ఉత్తరాలు కంకణ హస్తాలు రాసినవి కావు. ఈ వుత్తరం చివరిదాకా చదివాక మీకిది అర్థమౌతుంది. నా చేతికి (మణిబంధన!) తప్ప ఇంకేమీ లేదు...

మీరు ఏ ఫొటోనుచూచి మూడు పెద్దబుక్‌పోస్టుల కవిత్వం దించారో ఆమెను నేను సంవత్సరంనుంచీ ప్రేమిస్తున్నాను. మీ కవిత్వం మాత్రం ఆమెకేమీ అన్యాయం చెయ్యలేదు. కాలక్రమాన మామధ్య ప్రేమ మీరన్న ఎవరెస్టు శిఖరాలదాకా పోయింది. కాని ఒకమాట పట్టింపువల్ల యిద్దరమూ గతరెండుమాసాలుగా దూరమయ్యాం. దాంతో నాకుమతి చెడ్డది. ఫొటోతో మీకే మతిచెడంగా లేంది, సంవత్సరంనుంచీ ప్రేమించే నాస్థితి ఏమిటో మీరు ఊహించగలరనుకుంటాను...తిరిగి ఆమెను ఏవిధంగా

సంపాయించ గలనో అర్థంకాలేదు. ఎదుటపడి మాట్లాడి క్షమార్పణలు అర్పించుకునే అవకాశం కూడా లేదు. పోతే లేఖాసాహిత్యం వొక్కటే గతయింది.

సాహిత్యంలో నాకేమీ ప్రవేశం లేదు. ప్రణయ లేఖలురాసే అలవాటు అసలేలేదు. ఎలాగైనా ఆమెను స్తుతించి, సంతోషపెట్టి నా యథాస్థానాన్ని సంపాయించుకునే ఉపాయాన్ని ఆలోచించాను. మీలాటి పెద్దల్ని (పెద్దన్నలను) సహాయం కోరాల్సివొచ్చింది.

నా ప్రియురాలికి మీచేత లేఖలు రాయించటం ఒక విధంగా హాస్యాస్పదం. మీరసలు ఒప్పుకోక పోవచ్చు. లేదా అందుకో వెలను మీరుకోరవచ్చు; అందుకు నా ఖాళీపర్స్‌ను ఏలా దులిపేదీ? ఇంతాఏడుస్తే మీరు వుద్రిక్తులై ఘాటుగా నాటుకునే కావ్యాల్ని రాయలేక పోవచ్చు. యీ ఇబ్బంది రాకుండా చూసుకున్నాను. దీనికి మీ పేరు నా పేరూ సరిపోయింది. ఆమె ఫొటోనూ, మొదటి ఉత్తరాన్ని మీకు సాధనాలుగా పంపాను: సిగరెట్లను కూడా (మీ మామూలు సాధనం!) మీరు జత చేసుకొని కవిత్వం దించారు. నేను అనుకున్న దానికన్నా యెక్కువ వుద్రేకం మీలో కలిగింది. అందుకు వజ్రాయుధాల్లాటి మీ లేఖలే ప్రత్యక్ష తార్కాణం! ఆమె లేఖల్ని మీకు పంపుతూ (కొంత స్వంతంకూడా జతచేసి) మీ లేఖల్లోని కొంత భాగాన్నీ మీ కవిత్వాన్నీ మొత్తంగా ఆమెకు పంపుతూ - ఆమె పాత్రను నేనే ధరించి నాటకం ఆడాను. మీ కలం యెంతో పదునైంది. పోగొట్టుకున్న ప్రియురాల్ని మళ్ళీ సంపాయించుకున్నాను. తిరిగి పోగొట్టుకోకుండా వుండేందుకు పైవారంనాటికి మా వివాహం నిశ్చయమైంది. కనుక ఆమె విషయంలో నాకేమి నిరాశలు వుండబోవు.

మీ కవిత్వానికి నా జోహారులు! అది అమోఘం! గాలానికి తిమింగలం లాటి ప్రియురాలు కూడా గిరగిరా తిరిగి పట్టుబడాల్సిందే...అందులోనూ ఐదారులక్షల ఆస్తితో సహా నాకు భార్యనుసాధించి పెట్టారు. మీ శ్రమను వృథాపోనివ్వను. పై ఆదివారానికి మీరు వచ్చి వధూవరులకు ఆశీర్వచనం ఇస్తారని నమ్ముతాను. ఆ సందర్భంలో కవితా సన్మానమూ, పారితోషికమూ జరగగలవు. ప్రస్తుతం ఇక్కడ సర్కసేమీ లేదు. కనుక గజారోహణం పడకపోవచ్చు. మీకు దాని మీద అంత మోజువుంటే దారిలో ఏ సర్కసు నన్నా పట్టి ఏనుగును తెచ్చుకున్నారంటే బ్యాండుఖర్చు మనుషుల్నీ నేను చూస్తాను. "రాధారాణి" నవల పూర్తయితే - పంపండి - అచ్చు వేయిస్తాను.

మీకిక ప్రణయఘట్టాల్తోకూడిన కలలురావు: ప్రళయంతో కూడినవి రావొచ్చు. ప్రణయ కవిత్వానికి బదులు, స్టంటు కథలూ నవలలూ దిగినా దిగవొచ్చు. త్వరగా ఒక "మెంటల్ డాక్టర్" ను చూడండి.

మీరు పంపిన ఫొటో నాకింక అవసరం లేదు : ఎందుకంటే అసలు మనిషే నాకు దొరికింది కనుక! మీ ఫొటోను మాత్రం తిప్పి పంపుతున్నాను.

ఈ విషయంలో మీరింత అమాయకులుగా ఎలా ప్రవర్తించారో నాకు ఆశ్చర్యంగానే వుంది. ప్రియురాలి దగ్గర (మీ విషయంలో ఫొటో ముందు) ఎంత కొమ్ములు తిరిగిన రసికుడైనా, కవి అయినా, అనుభవజ్ఞుడైనా - ఒక బుద్ధిహీనుడల్లే ప్రవర్తించక తప్పదేమో? ఇదివరకు నేనొక్కణ్ణే బుద్ధిహీనుడ్ననుకునేవాణ్ని. మీలాటి పెద్దలు కూడా నాకు తోడుగా ఉన్నారని తెలుసుకొని ఆనందించాను. "ముద్దు కృష్ణయ్య" "మొద్దు కృష్ణయ్య" గా మారాక నేను ఎన్నుకొన్న "ప్రియురాలు" ఎంత గొప్పదో బాగా అర్థమైంది.

మనం ఇక పోస్టువాళ్ళకు డబ్బులు దండగ పెట్టటం అనవసరం...

ఉంటాను..నమస్తే

ముద్దు కృష్ణయ్య